సాక్షి ఖమ్మం

శుక్రవారం । 24 । జనవరి । 2025



సోలార్ వెలుగులు

ఒక మెగావాట్ సామర్థ్యంతో మండలానికొక సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేసి నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. IIలో



సెమీస్‌కు చేరిన క్రికెట్ టోర్నీ

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ టోర్నీ సెమీస్ దశకు చేరింది. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 15°

జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. రాత్రి మాత్రం చలిగాలుల తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఖమ్మం 8వ డివిజన్‌లో బల్లేపల్లి నుండి బాలపేట వరకు రోడ్డు విస్తరణ పనులకు, 15వ డివిజన్‌లో అల్లీపురం నుండి రామకృష్ణాపురం, అల్లీపురం నుండి జంగాల కాలనీ వరకు రహదారుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి ఎం.రాజ్యలక్ష్మి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 23న పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి ఫిబ్రవరి 1లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, 6నుండి 9వ తరగతుల్లో ఖాళీల భర్తీ, గౌలిదొడ్డిలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, అలుగునూరు సీఓఈల్లో 9వ తరగతి, రుక్మాపూర్‌లోని సైనిక్ స్కూల్‌లో, మల్కాజిగిరిలోని ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు సైతం పరీక్ష ఉంటుందని తెలిపారు.

పరీక్షల వేళ ఒత్తిడిని జయిస్తేనే ఫలితం



విద్యార్థినులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ

ఖమ్మంమయూరిసెంటర్: వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యాన విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా సిద్ధమైతే మెరుగైన ఫలితాలు వస్తాయని అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్‌శ్రేష్ఠ తెలిపారు. ఖమ్మం రాపర్తినగర్‌లోని తెలంగాణ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల–1ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు జేఈఈ, నీట్ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. అలాగే, అవసరమైన స్టడీ మెటీరియల్, క్రీడా కిట్లు సమకూరుస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థినులపై పాటే నేలపై కూర్చున్న అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆంగ్ల భాషలో నైపుణ్యం సాధించాలని సూచించారు. ఈ విషయంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు చొరవ తీసుకోవాలన్నారు. ఈక్రమంలో విద్యార్థిని ఆయేషా షిరీన్ అసిస్టెంట్ కలెక్టర్ చిత్రాన్ని గీయగా అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి కార్యాలయంలో కలిసి అవసరమైన సదుపాయాలను కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలకు చెక్

- 11 కేవీ లైన్ల మార్పునకు రూ.8.88 కోట్లు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇళ్ల మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ల కారణంగా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. పలుచోట్ల ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్న గ్రామస్తులు సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విద్యుత్ లైన్లను మార్చేందుకు అవసరమైన రూ.8.88 కోట్లు మంజూరు చేయించారు. ఈమేరకు గురువారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధుల్లో రూ.4.23 కోట్లను విద్యుత్ లైన్ల పొడిగింపునకు, మిగతా రూ.4.65 కోట్లను విద్యుత్ లేన్ల మార్పిడికి వినియోగించనున్నారు.

మరో లక్షన్నర..

నాలుగు పథకాలకు దరఖాస్తుల వెల్లువ

- చివరిరోజూ గ్రామసభల వద్ద జనం బారులు
- అధికారులపై ప్రశ్నల వర్షం, అనర్హులను ఎంపిక చేశారని అసంతృప్తి
- కొన్నిచోట్ల మధ్యలోనే సభలకు బ్రేక్



తనికెళ్ల సభలో దరఖాస్తు చేసుకునేందుకు బారులుదీరిన గ్రామస్తులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రజాపాలన సభల్లో దరఖాస్తుల స్వీకరణ, వీటి ఆధారంగా ఉద్యోగుల ఇంటింటి సర్వేలు.. ఆపై సంక్షేమ పథకాల అమలుకు రూపొందించిన అర్హుల జాబితాలపై జిల్లావ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈనెల 26వ తేదీ నుంచి అమలుచేయనున్న నాలుగు సంక్షేమ పథకాలకు ప్రాథమికంగా రూపొందించినట్లు చెబుతున్న జాబితాల ప్రదర్శనకు మూడు రోజుల పాటు నిర్వహించిన గ్రామ, వార్డుసభల్లో దాదాపు అన్నిచోట్లా ఉద్యోగులపై తిరగబడ్డారు. అర్హుల పేర్లను చేర్చకపోగా అనర్హులకు చోటు కల్పించారని మండిపడ్డారు. నిరసనలు, నిలదీతల నడుమే సభలు కొనసాగగా అర్హుల పేర్లు లేకపోతే మరోమారు దరఖాస్తు చేసుకోవాలన్న సూచనతో ఈ సభలు దరఖాస్తుల స్వీకరణ సభలుగా మారాయి. ఇలా మూడు రోజుల్లో జిల్లాలో నిర్వహించిన సభల్లో నాలుగు పథకాలకు 1,42,682 దరఖాస్తులు అందడం గమనార్హం. అయితే, దరఖాస్తుల సంఖ్యపై శుక్రవారానికి మరింత స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

ఆగ్రహ జ్వాలలు

జిల్లాలోని 589 గ్రామపంచాయతీలు, ఖమ్మం కార్పొరేషన్‌లోని 60 డివిజన్లతో పాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లోని 65వార్డుల్లో మూడు రోజుల పాటు గ్రామ, వార్డు సభలను నిర్వహించారు. అన్ని సభల్లోనూ సంక్షేమ పథకాలకు ప్రదర్శించిన జాబితాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జాబితాల్లో అనర్హులు ఉన్నారని, అర్హులకు చోటు కల్పించలేదని అధికారులను నిలదీశారు. కొన్నిచోట్ల నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో అధికారులు సభలను మధ్యలోనే ముగించి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఇక చివరిరోజైన గురువారం కూడా ఇదే పరిస్థితి నెలకొనగా పలుచోట్ల బీఆర్‌ఎస్, సీపీఎం, బీజేపీ నేతలు గ్రామస్తులకు మద్దతుగా నిరసన తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రకటించింది తుది జాబితా కాదని, ఇక్కడ అభ్యంతరాలు స్వీకరించి విచారణ అనంతరం అనర్హులను తొలగిస్తామని అధికారులు నచ్చచెప్పారు. కానీ సర్వే నిర్వహించి మరీ అనర్హులకు ఎలా చోటు కల్పించారని ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది.

సభలను సందర్శించిన కలెక్టర్..

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మూడు రోజుల్లో పలు చోట్ల సభలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయన ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. దీంతో కలెక్టర్ అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని, అనర్హులకు పథకాలు అందవని నచ్చచెప్పారు. దరఖాస్తుల స్వీకరణ, మంజూరు ఒక్క రోజుతో ముగిసిపోవని, నిరంతరం కొనసాగుతుందని సర్దిచెప్పారు. కాగా, తిరుమలాయపాలెం మండలం లక్ష్మీదేవిపల్లితండాలో బుధవారం జరిగిన సభలో అర్హుల పేర్ల జాబితాలో లేకపోవడానికి కారణమంటూ కార్యదర్శి ప్రణీతను పలువురు నిలదీశారు. దీంతో భయంతో ఆమె గ్రామపంచాయతీ కార్యాలయంలోకి వెళ్లగా కాసేపటికి బయటకు వచ్చాక సైతం అడ్డుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెళ్లి నచ్చచెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది.

పథకాల వారీగా మూడు రోజుల్లో అందిన దరఖాస్తులు

పథకం	మంగళవారం	బుధవారం	గురువారం
ఇందిరమ్మ ఇళ్లు	14,783	18,777	17,444
రేషన్‌కార్డులు	15,721	17,962	17,088
రైతుభరోసా	1,565	2,147	1,701
ఆత్మీయ భరోసా	9,213	13,943	12,340
మొత్తం	41,282	52,829	48,571

మండలాల్లో గ్రామసభలు ఇలా..

- రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం సభలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం జరిగిందని అధికారులను నిలదీశారు. ఆందోళకారులకు మార్కెట్ చైర్మన్ హనుమంతరావు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు
- వైరా మండలం విప్పలమడక సభలో అర్హులైన వారందరికీ పథకాలు అందేలా చూడాలని సీపీఎం రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎన్ని సర్వేలు చేసినా ఫలితం లేకపోగా, మరోమారు దరఖాస్తు చేసుకోవాలని సూచించడాన్ని తప్పుపట్టారు.
- కొణిజర్ల మండలం తనికెళ్ల సభ వద్ద ప్రజలు బారులు దీరారు. సంక్షేమ పథకాల జాబితాలో పేర్లు లేని వారు మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు.
- సింగరేణి మండలంలోని కారేపల్లి, విశ్వనాథపల్లి, ఉసిరికాయలపల్లిల్లో గ్రామసభలు గందరగోళంగా సాగాయి. అర్హులకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ బీఆర్‌ఎస్, సీపీఎం, బీజేపీ నేతలతోపాటు గ్రామస్తులు అధికారులను నిలదీశారు. దీంతో కారేపల్లి సభ నుంచి అధికారులు అర్ధంతరంగా వెళ్లిపోయారు.
- ముదిగొండలో నిర్వహించిన గ్రామసభ అరుపులు, కేకలతో దద్దరిల్లింది. తమ పేర్లు జాబితాల్లో లేవని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఈ గ్రామసభకు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ హాజరయ్యారు.
- ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం, తల్లంపాడు, మంగళగూడెంలో ఇళ్లు ఉన్న వారికి ఇళ్లు ఇచ్చారని, మిగతా పథకాల్లో కూడా అనర్హులను ఎంపిక చేశారని అధికారులను దీశారు.
- తిరుమలాయపాలెం మండలం లక్ష్మీదేవిపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రణతిని గ్రామస్తులు నిర్బంధించారు. సంక్షేమ పథకాల జాబితాలో తమ పేర్లు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- నేలకొండపల్లి గ్రామసభలోనూ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అరుపులు, కేకలు మిన్నంటాయి. జాబితాలో పేర్లు లేని వారు దరఖాస్తు చేసుకునేందుకు పోటెత్తారు.

కిటకిటలాడిన గ్రామసభలు

మూడోరోజైన గురువారం గ్రామసభల వద్ద జన సందోహం కనిపించింది. చాలా చోట్ల ప్రజలు నిరసనలు తెలిపారు. జాబితాల్లో పేర్లు రాని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో బారులు దీరి సమర్పించారు.



బోనకల్ గ్రామసభలో తనకు ఇల్లు మంజూరు చేయలేదని రోదిస్తున్న సుజాత

రూ.8.50 కోట్ల లాభాల్లో డీసీసీబీ

- కౌలు రైతులకూ పంట రుణాలు ఇచ్చేందుకు కృషి
- డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావు, పక్కన సీఈఓ వెంకటఆదిత్య

ఖమ్మంవ్యవసాయం: వ్యాపారాలు, డిపాజిట్లు, రుణ లావాదేవీలతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఆర్థికంగా బలోపేతమవుతూనే లాభాలు గడిస్తోందని చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన సీఈఓ ఎన్.వెంకటఆదిత్యతో కలిసి బ్యాంకు ప్రగతిని వెల్లడించారు. 2024 మార్చి నాటికి రూ.2,984 కోట్ల లావాదేవీలతో ఉన్న బ్యాంకు డిసెంబర్ 31 నాటికి ఏకంగా రూ. 3,391 కోట్లకు పెరిగిందని తెలిపారు. వ్యాపార పరంగా రూ.1,144 కోట్ల నుంచి రూ.1,247 కోట్లకు, పంట రుణాలు రూ.1,840 కోట్ల నుంచి రూ.2,143 కోట్లకు పెరిగాయని వివరించారు. తద్వారా లావాదేవీలు రూ.406 కోట్ల మేర పెరగగా, 2024 మార్చి నాటికి రూ.3.90 కోట్ల లాభాల్లో ఉన్న బ్యాంకు డిసెంబర్ 31నాటికి రూ.8.50 కోట్లకు చేరిందని తెలిపారు. డీసీసీబీ ద్వారా 1.69 లక్షల మంది రైతులకు రూ.900కోట్ల మేర రుణమాఫీకి సిఫారసు చేస్తే 92 వేల మందిని అర్హులుగా గుర్తించారన్నారు. ఇందులో 77,750 మంది రైతులకు చెందిన రూ.326 కోట్లు మాఫీ వర్తించిందని తెలిపారు. మిగిలిన రైతులు ఇతర బ్యాంకుల్లో రుణాలు కలిగి ఉండటంతో డీసీసీబీ నుంచి మాఫీ వర్తించలేదని చైర్మన్ చెప్పారు.

రూ.2 లక్షల ప్రమాద బీమా

బ్యాంకు ద్వారా రైతు సేవలో భాగంగా ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు చైర్మన్ వివరించారు. ఏటా రూ.14 ప్రీమియంతో రూ.2లక్షల బీమా వర్తిస్తుందని, ఈ ప్రీమియం కూడా బ్యాంకే చెల్లిస్తుందని తెలిపారు. గతంలో రూ.19గా ఉన్న ప్రీమియాన్ని ఈ ఏడాది రూ.14కు తగ్గించామన్నారు. గత ఏడాది 1.27 లక్షల మంది రైతుల కుటుంబాలకు పథకం ద్వారా రూ.24.18 లక్షలు అందగా, ఈ ఈ ఏడాది 1.20 లక్షల మంది కుటుంబాలకు రూ.16.70 లక్షలు చెల్లించామని చైర్మన్ వెంకటేశ్వరరావు వివరించారు.

గ్యారంటీ ఇస్తే వారికీ రుణాలు

భూమి లేని కౌలు రైతులకూ పంట రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు. పీఏసీఎస్‌ల చైర్మన్లు, సర్పంచ్‌లు గ్యారంటీ ఇస్తే రుణాలు ఇచ్చేందుకు ఆలోచనలో ఉన్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మార్ట్‌గేజ్ సమస్య అడ్డుగా ఉందని తెలిపారు. కాగా, పాడి గేదెలు, చేపల పెంపకం, కోళ్ల పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లకు నాబార్డ్ సహకారంతో రుణాలు ఇచ్చేందుకు కృషి జరుగుతోందని చెప్పారు.

సంక్షేమంపై ఆందోళన వద్దు...

- గ్రామసభల్లో అన్నీ విచారించాకే తుది జాబితా
- అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తిప్పారెడ్డిగూడెంలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తిరుమలాయపాలెం మండలంలోని కేశ్వాపురం, తిప్పారెడ్డిగూడెం, హైదర్‌సాయిపేట, పడమటితండా, చంద్రుతండా, మహ్మదాపురం, ఇస్లావత్‌తండా గ్రామాల్లో నిర్మించే సీసీ రోడ్లు, జోగులపాడులో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నాలుగు పథకాల అమలుకు నిర్వహిస్తున్న గ్రామసభల్లో చదివేది తుది జాబితా కాదని, ప్రజల నుంచి అందే అభ్యంతరాలు స్వీకరిస్తామని.. ఆపై దరఖాస్తులు కూడా తీసుకున్నాక అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించే బాధ్యత తనదని చెప్పారు. ఈనేపథ్యాన జాబితాలో పేరు లేకున్నా ఆందోళన పడొద్దని సూచించారు. జాబితాలో అనర్హులు ఉన్నట్లు లిఖితపూర్వకంగా తెలియచేస్తే విచారించి తొలగిస్తామని తెలిపారు. ఈనెల 26నుంచి నాలుగు పథకాల అమలు మొదలవుతుందని, ఆతర్వాత కూడా దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపిక కొనసాగుతుందని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

దెబ్బతిన్న చోట కొత్త రోడ్లు

గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. అలాగే, వచ్చే వర్షాకాలం నాటికి పాలేరు నియోజకవర్గంలోని గ్రామగ్రామాన ప్రతీ వీధిలో సీసీ రోడ్లు, అవసరమైన చోట లింక్ రోడ్లు నిర్మించడమే కాక వరదలో పాడైన రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తానని తెలిపారు. గత ప్రభుత్వం అప్పుల భారం మోపినా ప్రజల సంక్షేమం కోసం తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ ఎంపీడీఓ సిలార్ సాహెబ్, నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, చావా శివరామకృష్ణ, మంగీలాల్, అశోక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జైలు ఆవరణలో భద్రత భేష్



జైలు ఆవరణలో పరిశీలిస్తున్న సీపీ, అధికారులు

ఖమ్మంరూరల్: జిల్లా జైలు ఆవరణలో భద్రత పటిష్టంగా ఉండడమే కాక ఆవరణను పచ్చదనంతో తీర్చిదిద్దడం అభినందనీయమని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం రామన్నపేటలోని జిల్లా జైలులో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆవరణలో పరిశీలించిన సీపీ మాట్లాడుతూ ఖైదీల్లో అక్షరాస్యత పెంచేందుకు అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషిని కొనసాగించాలని సూచించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడిన సీపీ శిక్షా కాలం పూర్తయ్యాక సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. ఏఆర్ ఏసీపీ సుశీల్‌కుమార్ సింగ్, జైలు సూపరింటెండెంట్ శ్రీధర్, జిల్లా సబ్ జైళ్ల అధికారి జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

26న జిల్లాస్థాయి టీ.టీ. టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 26న జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, వీవీఎస్.సాంబమూర్తి తెలిపారు. ఈసందర్భంగా పోటీల పోస్టర్లను గురువారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పేర్ల నమోదుకు 98484 08335, 94918 20320 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో శృతి, కామేశ్వరి, పొజ్యా, రాజేష్, పవన్, చలపతిరావు, ముజాహర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సందు దొరికితే సర్దేసుడే..

సబ్ రిజిస్ట్రార్లు తలుచుకుంటే బస్టాండ్ అయినా.. చార్మినార్ అయినా రిజిస్ట్రేషన్ చేస్తారనేది ఓ నానుడి. అందుకు తగినట్టుగానే ఇటీవల వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాలా కన్వర్షన్ లేని భూములకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన ఘటన మరువక ముందే సత్తుపల్లి కార్యాలయంలో మరో అక్రమం వెలుగుచూసింది. ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు అధికారులు, సిబ్బంది పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

–సత్తుపల్లి

- 257 జీఓ ఆధారంగా అక్రమ రిజిస్ట్రేషన్లు
- సత్తుపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులు, ఉద్యోగుల చేతివాటం
- విమర్శలు వెల్లువెత్తడంతో సెలవులో వెళ్లిన అధికారి, మరొకరికి ఇన్‌చార్జ్



సత్తుపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



రోడ్డు వెడల్పు తగ్గించి రిజిస్ట్రేషన్ చేయించిన భూమి ఇదే..

అనుకూలంగా మలుచుకుని...

మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 2019 కంటే పూర్వం గజాల్లో రిజిస్ట్రేషన్ చేసిన భూములను మాత్రమే విడగొట్టి క్రయవిక్రయాలు జరుపుకునేలా 257 జీఓ తీసుకొచ్చింది. లేఅౌట్ లేకుండా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరగొద్దనే భావనతో జారీ చేసిన ఈ జీఓకు తూట్లు పొడిచి అక్రమ మార్గాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని సమాచారం. దీన్ని సబ్ రిజిస్ట్రార్లు ఆదాయ వనరుగా మార్చుకుని భూమి ఏదైనా సరే విడగొట్టి రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.లక్షల్లో వసూలుచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరికొందరు వ్యవసాయ భూమిని సైతం అక్రమంగా నాలా రిజిస్ట్రేషన్ల ద్వారా తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నట్లు సమాచారం.

ఏకంగా రోడ్డునే తగ్గించి వేసి..

సత్తుపల్లి బైపాస్‌రోడ్డులోని సర్వే నంబర్ 106/ఏ/1లో భూమి ఇద్దరు వ్యక్తుల మధ్య పహాణీతో రిజిస్ట్రేషన్ అయింది. గతేడాది డిసెంబర్‌లో ఇదే డాక్యుమెంట్‌ను 300 గజాల చొప్పున విడగొట్టి ఆరుగురి పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. అయితే పాత డాక్యుమెంట్‌లో రిజిస్ట్రేషన్ చేసిన సమయాన ఉన్న 40 అడుగులుగా రోడ్డును రెండో దఫాలో 30 అడుగులకు తగ్గించడం గమనార్హం. ఈ సమయాన రూ.లక్షల్లో చేతులు మారినట్లు సమాచారం. మూడెకరాల స్థలంలో పది అడుగుల వెడల్పు రోడ్డు తగ్గించడంతో భూయజమానులకు ఎంత మేలు జరిగింది, అధికారులకు ఎంత ముట్టచెప్పారో అర్థం చేసుకోవచ్చు.

సెలవుపై సబ్ రిజిస్ట్రార్..

కేవలం మూడు నెలల వ్యవధిలోనే పెద్ద ఎత్తున అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణల నేపథ్యాన ఉన్నతాధికారుల సూచనలతో సత్తుపల్లి సబ్‌రిజిస్ట్రార్ సెలవులో వెళ్లినట్లు సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ల కంటే ఈ అధికారి మరిన్ని అక్రమాలకు పాల్పడ్డాడనే ప్రచారం జరుగుతోంది. అయితే, ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నారని చెబుతూ విచారణ చేపట్టకుండా, చర్యలు తీసుకోకుండా సెలవుపై పంపించడం గమనార్హం. అయితే, సత్తుపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏ అధికారి వచ్చినా ఒకరిద్దరు డాక్యుమెంట్ రైటర్లు అధికార పార్టీ పేరు చెప్పి మచ్చిక చేసుకోవడం లేదంటే బెదిరించి మరీ పనులు చేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి. అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించడంలో సబ్‌రిజిస్ట్రార్ పాత్ర స్థాయిలోనే డాక్యుమెంట్ రైటర్ల పాత్ర కూడా ఉంటోందనే చర్చ జరుగుతోంది.

విచారణ జరిపిస్తాం

సత్తుపల్లి రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలు ఉల్లంఘించిన జరిగిన లావాదేవీలపై ఫిర్యాదులు అందాయి. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపిస్తాం. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ సెలవులో వెళ్లడంతో ఇన్‌చార్జ్ బాధ్యతలు మరో ఉద్యోగికి అప్పగించాం.

– రవీందర్, జిల్లా రిజిస్ట్రార్, ఖమ్మం

క్లుప్తంగా

అధ్యాపకురాలు రోజాకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న నాగపురి రోజా

ఖమ్మంసహకారనగర్: స్వామి వివేకానంద జయంతోత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలోని ఖానాపురం హవేలీకి అధ్యాపకురాలు నాగపురి రోజా పురస్కారం అందుకున్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్(టీసీసీ) ఆధ్వర్యాన హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో యూత్ అండ్ నేషనల్ యూనిటీ అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదుగా రోజా అవార్డు అందుకున్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తుండడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండడంతో ఆమెకు ఈ అవార్డు లభించింది.

కవి సవ్యసాచికి...



పురస్కారం అందుకుంటున్న సవ్యసాచి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంకు చెందిన కవి సవ్యసాచికి గిడుగు రామ్మూర్తి పంతులు జాతీయ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఖమ్మం భద్రాద్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న సవ్యసాచి అనువాద సాహిత్యానికి గాను పురస్కారం అందుకున్నారు.

రాజకీయాలకు అతీతంగా పథకాలు మంజూరు చేయాలి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు

ముదిగొండ: అర్హతే ప్రాతిపదికన, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సూచించారు. ముదిగొండలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. సెంట్ భూమిలేని నిరుపేదలందరికీ ఉపాధి హామీ పథకంతో నిమిత్తం లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపచేయాలని, దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ఆత్మీయ భరోసాపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నందున భూమి ఉన్న రైతులందరికీ రైతుభరోసా ఇస్తున్నట్లుగానే భూమిలేని పేదలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలని సూచించారు. ఈ సభలో జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, తహసీల్దార్ సునీత ఎలిజబెత్, ఏఈఓ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి



విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న డీఐఈఓ రవిబాబు

ముదిగొండ: వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యాన ఇంటర్‌మీడియట్ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని డీఐఈఓ రవిబాబు సూచించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు గురువారం నుంచి రాగిజావ పంపిణీ చేస్తున్నారు. ఈకార్యక్రమాన్ని ముదిగొండ జూనియర్ కళాశాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రతీరోజు ఉదయం రాగిజావ అందిస్తామని తెలిపారు. అనంతరం కళాశాలలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఆయన విద్యార్థుల హాజరు, బోధనపై సమీక్షించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,650	6,650
మిర్చి	15,000	6,500
మిర్చి తాలు	7,200	4,000
ఏసీ మిర్చి	13,500	5,500
పత్తి	7,150	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

సోలార్ వెలుగులు..

- ప్రతీ మండలంలో ఒక మెగావాట్ సామర్థ్యంతో యూనిట్
- మూడు నుంచి ఐదెకరాల స్థలం గుర్తింపునకు సర్వే
- ఉమ్మడి జిల్లాలో 300ఎకరాల సేకరణే లక్ష్యం
- నిర్వహణ బాధ్యతలు మహిళా సంఘాలకు అప్పగింత



నేలకొండపల్లి: థర్మల్, హైడల్ రంగాల్లో విద్యుత్ ఉత్పత్తి నానాటికీ పెరుగుతుండడంతో సోలార్ విద్యుత్ రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో గృహ, వ్యవసాయ అవసరాలకు సోలార్ ప్లాంట్లు అమర్చాలని నిర్ణయించి ఇప్పటికే సర్వే చేయిస్తోంది. ఇవికాక మండలానికి ఒక సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి వివిధ చర్యలు చేపడుతున్న ప్రభుత్వం ఇప్పుడు సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, నిర్వహణలోనూ మహిళలను భాగస్వామ్యులు చేసేలా చర్యలు చేపడుతోంది. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఖమ్మం ఉమ్మడి జిల్లాలో మండలానికొక ప్లాంట్ ఏర్పాటుచేసి మహిళలకు అప్పగించనుండగా, అవసరమైన భూమి గుర్తించడంలో రెవెన్యూ, విద్యుత్ అధికారులు నిమగ్నమయ్యారు.

సబ్‌స్టేషన్‌కు ఐదు కి.మీ. లోపల

జిల్లా వ్యాప్తంగా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేయనుండగా అవసరమైన భూమిని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మూడు నుంచి ఐదు కిలోమీటర్ల లోపల గుర్తించాల్సి ఉంటుంది. తద్వారా ప్లాంట్ నుంచి సబ్‌స్టేషన్‌కు లైన్ వేయడం సులువవుతుందని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 300 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తించాలని ఆదేశాలు అందాయి. ప్రభుత్వ భూములను సర్వే చేసి నివేదిక ఇచ్చాక యూనిట్ల ఏర్పాటులో సాంకేతిక సమస్యలు రాకుండా మరోమారు పరిశీలించాల్సి ఉంటుంది. ఈ సర్వే బృందాల్లో ఎన్పీడీసీఎల్, రెవెన్యూ, టీఎస్ రెడ్కో అధికారులు ఉంటారు. వీరు కూడా నివేదిక ఇచ్చాక ఆసక్తి ఉన్న మహిళా సంఘాల గుర్తించి బ్యాంకర్లతో రుణాలు ఇప్పించడంపై దృష్టి సారిస్తారు.

మండలానికో యూనిట్

ప్రస్తుతం పైలట్ ప్రాజెక్ట్ కింద మండలంలో ఒక మెగావాట్ సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం ఏర్పాటుచేసే ప్లాంట్లకు 300 ఎకరాల భూమి అవసరమవుతుందని అంచనా. ఒక మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు మూడెకరాల భూమి అవసరమని, ఆపై యూనిట్ ఏర్పాటుకు దాదాపు రూ.3 కోట్ల వరకు వ్యయమవుతుందని సమాచారం. ఈ నగదును మహిళా సంఘాలకు రుణంగా ఇప్పించి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ఆపై మహిళా సంఘాలు అందే నగదుతో రుణం తీరుస్తూనే వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.



కొత్తకొత్తూరులో స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ (ఫైల్)

కొనసాగుతున్న భూముల గుర్తింపు



ఉమ్మడి జిల్లాలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములను గుర్తిస్తున్నాం. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మూడు నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న భూములను గుర్తించాల్సి ఉంటుంది. స్థలాలు ఖరారయ్యాక ఆసక్తి ఉన్న మహిళా సంఘాలకు ప్లాంట్ల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. ప్రతీ మండలంలో ఒక మెగావాట్ సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటు చేస్తాం.

– పి.అజయ్‌కుమార్, రెడ్కో మేనేజర్, ఖమ్మం

సెమీస్ దశకు చేరిన బాలికల క్రికెట్ టోర్నీ



పరుగు కోసం ప్రయత్నిస్తున్న బ్యాట్స్ ఉమెన్ (ఇన్‌సెట్) బ్యాటింగ్ చేస్తూ...

నేడు ముగియనున్న రాష్ట్రస్థాయి పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి బాలికల అండర్–17 క్రికెట్ టోర్నీ సెమీస్ దశకు చేరింది. పూల్ 'ఏ'లో రంగారెడ్డి, మెదక్, పూల్ 'బీ'లో ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్లు సెమీస్ చేరాయి. రెండో రోజైన గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో రంగారెడ్డి జట్టు మెదక్‌పై 32 పరుగుల తేడాతో విజయం సాధించింది. నల్లగొండపై హైదరాబాద్ ఎనిమిది వికెట్లు తేడాతో, ఆదిలాబాద్‌పై మహబూబ్‌నగర్ 53 పరుగులు తేడాతో, వరంగల్ జట్టుపై ఖమ్మం 88 పరుగులు తేడాతో విజయం గెలిచాయి. అలాటే, కరీంనగర్‌పై హైదరాబాద్ 10 వికెట్ల తేడాతో, నల్లగొండపై మెదక్ 48 పరుగులు తేడాతో, కరీంనగర్‌పై రంగారెడ్డి 10 వికెట్ల తేడాతో నెగ్గాయి. రెండో రోజు మ్యాచ్‌లను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కార్యదర్శులు కె.నర్సింహామూర్తి, నరేష్‌కుమార్, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.శ్రీనివాస్, రాష్ట్ర పరిశీలకులు ఎస్.గోపాల్ పాల్గొన్నారు. అంపైర్లుగా సంపత్‌కుమార్, రఘు, అబ్బాస్, నర్సింహారావు, జి.శివ, సైదులు, పి.శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. కాగా, శుక్రవారం రెండు సెమీస్, ఆపై ఫైనల్స్ ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు.

'స్ఫూర్తి' ఫౌండేషన్ ద్వారా విద్యార్థికి చేయూత

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచకు చెందిన సకుర్తి యమునారాణి పీ.వీ.నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీలో బీవీఎస్సీ సీటు సాధించగా ఆమె తండ్రి, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అయిన సక్కుర్తి రామారావు ఫీజు చెల్లించలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. దీంతో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి పరక రామారావును సంప్రదించగా ఆయన ఇచ్చిన సమాచారంతో సీతారత్నకుమారి ఆర్థిక సాయానికి ముందుకొచ్చారు. దీంతో విద్యార్థినికి గురువారం గురువారం రూ.80వేల చెక్కు అందచేశారు.



యమునారాణికి చెక్కు అందచేస్తున్న దృశ్యం

స్నేహితుడి కుటుంబానికి ఆసరా

కూసుమంచి: అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఆయన స్నేహితులు అండగా నిలిచారు. మండలంలోని మల్లేపల్లికి చెందిన కాకర్ల వీరస్వామి ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ఆయనతో చదివిన 2025 బ్యాచ్ విద్యార్థులు కుటుంబానికి చేయూతనివ్వాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సేకరించిన రూ.80వేలను గురువారం తమ గురువు చంద్రశేఖర్ చేతుల మీదుగా వీరస్వామి పిల్లలకు అందజేశారు. ఈకార్యక్రమంలో బానరోత్ రవి, కార్తీక్, వీరన్న, రవి, అనిల్, వీరబాబు, రాజశేఖర్, కోటి తదితరులు పాల్గొన్నారు.



వీరస్వామి పిల్లలకు నగదు అందజేస్తున్న చంద్రశేఖర్, స్నేహితులు

కేంద్రీయ విద్యాలయంలో 'పరాక్రమ దివస్'



విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం పరాక్రమ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలు ఏర్పాటుచేయగా పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈకార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ కవీంద్ర రాయ్ ప్రారంభించగా, వీడియో చిత్రాల ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరగనున్న 38వ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టులో ఖమ్మంకు చెందిన ఎ.మైథిలికి స్థానం దక్కింది. ఈనెల 28నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జరిగే పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఇటీవల హనుమకొండలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మైథిలిని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డీ.జాకీరుల్లా, కోచ్ ఎం.డీ.గౌస్, పీడీ డాక్టర్ రఘునందన్ తదితరులు అభినందించారు.



మైథిలిని అభినందిస్తున్న డీవైఎస్ఓ, ప్రిన్సిపాల్ తదితరులు

ఆర్చరీ మీట్‌కు...

ఖేలో ఇండియా సెంటర్‌కు చెందిన సీహెచ్.ఔచిత్య జాతీయస్థాయి జూనియర్ ఆర్చరీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఆమెను పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికచేశారని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఖేలో ఇండియా సెంటర్‌కోచ్ పాయం నగేష్ తెలిపారు.

డైమండ్ జూబ్లీ జంబోరీకి శ్రీనివాస్



శ్రీనివాస్

ఖమ్మంస్పోర్ట్స్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పడి 75ఏళ్లు పూర్తయిన ఈనెల 28నుండి ఫిబ్రవరి 3 వరకు తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిలో డైమండ్ జూబ్లీ జంబోరీ నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనాలని ఖమ్మంకు చెందిన శ్రీనివాస్‌కు ఆహ్వానం అందింది. వారం పాటు జరిగే జంబోరీ ఉత్సవాల్లో దేశవ్యాప్తంగా 40 వేల మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొంటారు. ప్రస్తుతం నేలకొండపల్లి నాచేపల్లి జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ 25 ఏళ్లలో ఎందరో కేడెట్లకు శిక్షణ ఇవ్వగా ప్రస్తుతం తెలంగాణ ట్రైనింగ్ టీంలో అసిస్టెంట్ లీడర్ పనిచేస్తున్నారు.

108 వాహనం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న కోఆర్డినేటర్

పెనుబల్లి: పెనుబల్లిలోని 108 వాహనాన్ని జిల్లా కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. వాహనంలో పరికరాల పనితీరు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఫోన్ రాగానే త్వరగా ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులు, అనారోగ్య బాధితులను ఆస్పత్రులకు చేర్చాలని సూచించారు. ఈఎంటీ బి.రమేష్, పైలట్ జె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్‌సీఓ తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్‌సీఓ నాగార్జునరావు

కొణిజర్ల: మండల పరిధి తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను గురుకులాల ఆర్‌సీఓ కె.నాగార్జునరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి బోధన, వసతులపై ఆరా తీసిన ఆయన పరిసరాలు వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. ఆతర్వాత బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమైన ఆర్‌సీఓ విద్యార్థినులకు మెనూ ఆధారంగా భోజనం సమకూరుస్తూనే మెరుగైన బోధన అందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రజిత, అధ్యాపకులు కే.పీ.ఐశ్వర్య, కె.రజిని, బి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి రూ.6లక్షల విరాళం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యాన జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం పలువురు భక్తులు విరాళం అందచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ మాధవనగర్‌కు చెందిన వింజమూరి భాస్కర్‌రావు – ధనలక్ష్మి దంపతులు రూ.5,00,004 విరాళం చెక్కును అధికారులకు అందజేశారు. అలాగే, ఖమ్మం గొల్లగూడెం వాసి ఎస్‌సీహెచ్.కృష్ణమాచార్యులు–రమాదేవి దంపతులు రూ.1,00,116ను ఆలయ ఈఓ రమాదేవికి అందజేశాక స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, అర్చకులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కాకినాడ దాతలకు రశీదు ఇస్తున్న ఈఓ

ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు

పెనుబల్లి: సంక్షేమ పథకాల కోసం గ్రామసభల్లో అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. పెనుబల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేసిన ఆమె ఉద్యోగులకు సూచనలు చేశారు. గ్రామసభల్లో అందిన దరఖాస్తులను తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తద్వారా అర్హులకు పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అన్నపూర్ణ, తహసీల్దార్ జి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వేంసూరు: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. వేంసూరు మండలం చిన్నమల్లెలలో జరిగిన గ్రామసభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు తమ పేర్లు పథకాల జాబితాలో లేవని, రుణమాఫీ కూడా పూర్తి స్థాయిలో జరగలేదని తెలిపారు. దీంతో స్పందించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందేలా దరఖాస్తుల స్వీకరణ, మంజూరు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఎం.పీ.రాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రంజిత్ కుమార్, పంచాయితీ కార్యదర్శి దివ్య ఉన్నారు.

'కాంగ్రెస్‌వి అవకాశవాద రాజకీయాలు'

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన ఖమ్మంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగంపై కానీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కానీ సరైన గౌరవం లేదన్నారు. అంబేడ్కర్ భౌతిక కాయానికి ఢిల్లీలో అంత్యక్రియలు నిర్వహించకుండా ఎవరు అడ్డుకున్నారు, స్మారక చిహ్నం నిర్మాణాన్ని ఎవరు కాదన్నారో ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజలంతా గమనించి ప్రధాని మోదీ పాలనకు మద్దతు తెలపాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు సన్నె ఉదయ ప్రతాప్, గెంటేల విద్యాసాగర్, ఈ.వీ.రమేష్, శ్యాం రాథోడ్, నున్న రవికుమార్, డాక్టర్ శీలం పాపారావు, మందా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

25న యాదవ మహాసభ సమావేశం

ఖమ్మంఅర్బన్: తెలంగాణ యాదవ మహాసభ జిల్లా స్థాయి సమావేశాన్ని ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం తెలిపారు. ఖమ్మం శ్రీనగర్‌కాలనీలోని మారకాస్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 25 ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఈసందర్భంగా సంఘం నిర్మాణం, యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈమేరకు సంఘం సభ్యులు హాజరుకావాలని కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

వైరా: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వివాహిత గురువారం వైరా రిజర్వాయర్‌లో దూకే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తికి చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి రిజర్వాయర్ అనకట్టపైకి చేరుకుని ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు తన సోదరికి ఫోన్ ద్వారా తెలిపింది. దీంతో ఆమె సోదరి డయల్ 100కు ఫోన్ చేయగా వైరా పోలీసులు హుటాహుటిన చేరుకుని మహిళను నిలువరించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా, ఆమె తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన తన భర్త వేధింపులతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పగా కుటుంబీకులను పిలిచి కౌన్సెలింగ్ అనంతరం అప్పగించారు.

అవసరం మేరకే యూరియా

ముదిగొండ: పంటలు సాగు చేసే రైతులు అధికారుల సిఫారసు మేరకే ఎరువులు వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. అలాకాకుండా యూరియా మోతాదుకు మించి వాడితే పంట భూములు సారం కోల్పోతాయని తెలిపారు. మండలంలోని బాణాపురం, ముదిగొండ, మేడేపల్లిలోని ఎరువుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. దుకాణాల్లో రికార్డులు, స్టాక్‌ను పరిశీలించి బ్లాక్ చేయాలని యత్నించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రైతులతో మాట్లాడిన డీఏఓ యూరియా మోతాదు కంటే అధికంగా వాడొద్దని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఓ వేణు పాల్గొన్నారు.



● ఇంగ్లీష్ ఇడియమ్స్

లెట్ ది డస్ట్ సెటిల్

ఒక సంక్షోభం తరువాత లేదా గందరగోళం తరువాత వచ్చే సమయం కోసం ఎదురుచూసే సందర్భంలో వాడే మాట...లెట్ ది డస్ట్ సెటిల్.

ఉదా: ది కంపెనీ ఈజ్ ఫేసింగ్ క్రిటిసిజమ్ నౌ, బట్ దే ఆర్ వెయిటింగ్ టు లెట్ ది డస్ట్ సెటిల్ బిఫోర్ మేకింగ్ ఏ స్టేట్‌మెంట్

● మ్యూజిక్ వరల్డ్

మదిని దోచేలా మైమరచి పోయేలా!



అమెరికన్ సింగర్-సాంగ్ రైటర్ గ్రేసీ అబ్రామ్స్ రాసిన పాట 'దట్ ఈజ్ సో ట్రూ' బిల్‌బోర్డ్ జాబితాలో అగ్ర స్థానంలో ఉంది. ఇది గ్రేసీ రెండవ ఆల్బమ్. అమెరికాకు వెలుపల ఆస్ట్రేలియా, బెల్జియం, న్యూజీలాండ్, నార్వే, యూనైటెడ్ కింగ్ డమ్, ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, నెదర్లాండ్స్, స్వీడన్, స్విట్జర్లాండ్‌లో మ్యూజిక్ చార్ట్‌లలో అగ్ర స్థానంలో నిలిచింది. 'ఐ కుడ్ గో అండ్ రీడ్ యువర్ మైండ్' అని హుషారెత్తిస్తోంది. ఆ సందడిలో మీరు భాగం కావాలంటే....'దట్ ఈజ్ సో ట్రూ' ఒక్కసారి వినేయండి. 'షీ ఈజ్ సో కూల్' అంటూ గ్రేసీతో గొంతు కలపండి.

● గేమింగ్

స్పైడర్-మ్యాన్ మరోసారి...

గ్రేట్ సూపర్ హీరోలా సాహసాలు ఎప్పుడూ సూపర్‌గానే ఉంటాయి. దీనికి ఉదాహరణ... స్పైడర్-మ్యాన్!

ఒక్క ముక్కలో చెప్పాలంటే స్పైడర్-మ్యాన్ గేమ్స్ ఎన్నో సాహసాలకు కేరాఫ్ అడ్రస్. 'మార్వెల్స్ స్పైడర్-మ్యాన్ 2' యాక్షన్ అడ్వెంచర్ గేమ్. మార్వెల్ కామిక్స్ క్యారెక్టర్ 'స్పైడర్-మ్యాన్' ఆధారంగా రూపొందించిన గేమ్ ఇది. థర్డ్ పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే ఈ గేమ్‌లో పీటర్ పార్కర్, మైకేల్ మోరేల్స్ ప్రధాన పాత్రలు. న్యూయార్క్ కేంద్రంగా సాగే ఈ ఆటలో ప్లేయర్స్ రకరకాల స్పైడర్-మ్యాన్ సూట్‌లను సేకరించవచ్చు.



సమస్త సాహసాలతో గేమింగ్ కమ్యూనిటీని ఆకట్టుకునే 'మార్వెల్స్ స్పైడర్-మ్యాన్' ఈ నెల చివర రానుంది.

సిరీస్: మార్వెల్స్ స్పైడర్-మ్యాన్
ప్లాట్‌ఫామ్స్: విండోస్
జానర్: యాక్షన్-అడ్వెంచర్
మోడ్: సింగిల్-ప్లేయర్



● రికార్డ్

ప్రయాణ ప్రేమికుడు, ప్రఖ్యాత పర్వతారోహకుడు సర్ మార్టిన్ కాన్వే 'అధిరోహించిన ప్రతి శిఖరం ఏదో ఒకటి నేర్పుతుంది' అంటారు. అలా చిన్న వయసులోనే ఎన్నో శిఖరాల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంది విశాఖపట్నానికి చెందిన కామ్య కార్తికేయన్. పదహారేళ్లకే ఎవరెస్ట్ అధిరోహించి రికార్డ్ సృష్టించింది. తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసిన యంగెస్ట్ ఫిమేల్‌గా రికార్డు సృష్టించింది....

కామ్య... అఖండ ఖ్యాతి

ఇలా మొదలైంది...

కార్తికేయన్, లావణ్య దంపతులకు సాహస యాత్రలు ఇష్టం. తమ చిన్నారి కామ్యను భుజాలపై మోసుకుంటూనే ట్రెక్కింగ్‌కు వెళుతుండేవారు. అలా పర్వత శిఖరాలతో చిన్నవయసులోనే కామ్యకు పరిచయం అయింది. మూడేళ్ల వయసులోనే ముంబైలోని లోనావాలాలో తండ్రితో పాటు ట్రెక్కింగ్‌లో పాల్గొని 'శభాష్' అనిపించుకుంది. మహారాష్ట్రలోని డ్యూక్స్ నోస్, రాజ్‌గడ్ పర్వతాల్ని నాలుగేళ్ల వయసులో తల్లిదండ్రులతో పాటు అధిరోహించింది.

తల్లికి తగిన తనయ...

హిమాలయాల ట్రెక్కింగ్‌కు తల్లితో పాటు వెళ్లింది కామ్య. అప్పుడు ఆమె వయసు ఏడేళ్లు. తల్లీ కూతుళ్లు మొదటి ప్రయత్నంలోనే 12 వేల అడుగుల ఎత్తైన చంద్రశీల పర్వతారోహణ చేశారు. ఆ తర్వాత హిమాలయ పర్వత శ్రేణుల్లో ఒకటైన 13,500 అడుగుల ఎత్తైన హర్‌కిదమ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. అది పూర్తి చేసిన కొద్ది రోజుల్లోనే 13,500 అడుగుల ఎత్తైన కేదార్‌కంఠ పర్వతారోహణ చేశారు.

తొమ్మిదేళ్ల వయసులో హిమాలయాల్లో రూప్‌కుండ్ ట్రెక్కింగ్ చేసి రికార్డు సృష్టించింది కామ్య.

ప్రధాని మన్ కీ బాత్‌లో కామ్య...

'అవరోధాల్ని అధిగమించి మన ఖ్యాతిని ఖండాంతరాల్లో ఇనుమడింపజేయాలి అనుకునేవారికి విశాఖ నగరానికి చెందిన కామ్య కార్తికేయన్ అనే చిన్నారి స్ఫూర్తినిచ్చింది' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ కామ్యను ప్రశంసించారు. దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తైన అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించిన సమయంలో మన్‌కీ బాత్‌లో కామ్య ప్రస్తావన తీసుకువచ్చారు మోదీ.

– కరుకోల గోపీకిశోర్‌రాజా, సాక్షి, విశాఖపట్నం

ఆల్ రౌండర్

ముంబై నేవీ స్కూల్‌లో ప్లస్‌టు చదువుతున్న కామ్య కార్తికేయన్ పర్వతారోహణలోనే కాదు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. ప్రతి పరీక్షలోనూ ఫస్ట్ గ్రేడ్ సాధిస్తోంది. సంగీతంలోనూ ప్రావీణ్యం పొందిన కామ్య పియానో వాయిద్యానికి సంబంధించి 3 గ్రేడులు పాసైంది. కర్ణాటక సంగీతం, భరతనాట్యంలోనూ 'ఆహా' అనిపించేలా ప్రతిభ చూపుతోంది.

ఏడు ఖండాల్లో ఎన్ని రికార్డ్‌లో!

● దక్షిణ అమెరికాలో 22,837 అడుగుల ఎత్తైన మౌంట్ అకాన్‌కాగువాని అధిరోహించి ఈ శిఖరాన్ని అధిరోహించిన తొలి బాలికగా ప్రపంచ రికార్డు సృష్టించింది ● ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తైన 18,652 అడుగుల మౌంట్ కిలిమంజారోపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి ఈ శిఖర యాత్ర పూర్తి చేయించడం ద్వారా ఆసియాలోనే అతి పిన్న వయస్కురాలిగా రికార్డు ● యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తైన 18,510 అడుగుల మౌంట్ ఎల్‌బ్రస్‌ని అధిరోహించి యంగెస్ట్ గర్ల్ ఇన్‌ది వరల్డ్‌గా రికార్డు ● ఆస్ట్రేలియా ఖండంలోని అతి ఎత్తైన మౌంట్ కాజియాస్కోని అధిరోహించిన రెండో బాలికగా రికార్డు ● ఉత్తర అమెరికాలోని 20,308 అడుగుల మౌంట్ డెనలీని అధిరోహించిన యంగెస్ట్ నాన్ అమెరికన్‌గా రికార్డు ● ఆసియా ఖండంలో అత్యంత ఎత్తైన 29,031 అడుగుల మౌంట్ ఎవరెస్ట్‌ని అధిరోహించి నేపాల్ వైపు నుంచి ఎవరెస్ట్‌ని అధిరోహించి ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా, తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి, ప్రపంచంలోనే అతి పిన్నవయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది.

ప్రతి అడుగూ సవాల్‌గా స్వీకరించాను

సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసి భారత త్రివర్ణపతాకాన్ని ఏడు ఖండాల్లోనూ రెపరెపలాడించాలన్నదే అమ్మా, నాన్నల కల. వారి ఆకాంక్ష నెరవేర్చినందుకు గర్వంగా ఉంది. ఒకానొక సమయంలో మా పేరెంట్స్ తమ సంపాదనంతా నా మీదే ఖర్చు చేశారు. కొందరు దాతలు సహకారం అందించి నన్ను ముందుకు నడిపించారు. ఎంతటి కష్టాన్నైనా అవలీలగా ఎదుర్కోవాలన్నది నాన్న దగ్గర నేర్చుకున్నాను.

– కామ్య కార్తికేయన్

యువర్స్

● టెక్.. టాక్

ఇన్‌స్టాలో ఎడిట్ యాప్



స్మార్ట్‌ఫోన్‌లలో షార్ట్ వీడియో క్రియేషన్ సరికొత్త స్థాయికి చేరుకుంది. క్రియేటర్స్‌కు దగ్గరైన ప్లాట్‌ఫామ్‌లలో ఇన్‌స్టాగ్రామ్ ఒకటి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐఫోన్‌ల కోసం 'ఎడిట్' యాప్‌ను ప్రకటించింది ఇన్‌స్టా.

'అధిక నాణ్యతతో వీడియోను రికార్డ్ చేయడానికి, మీరు కోరుకునే అన్ని ఎడిటింగ్ సాధనాలు, ఫ్రెండ్స్‌తో పాటు ఇతర క్రియేటర్‌లతో డ్రాఫ్టను షేర్ చేసే సామర్థ్యం ఎడిట్‌లో ఉంటాయి. ఎడిట్ అనేది క్రియేటివ్ టూల్స్ సమాహారం' అని ప్రకటించాడు ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మొస్సేరి.

'ఎడిట్స్' యాప్‌ను ఉపయోగించడం వల్ల యూజర్‌లు వాటర్ మార్క్ లేకుండా వీడియోలను ఎక్స్‌పోర్ట్ చేయడానికి, వీడియోల పనితీరును విశ్లేషించడానికి...మొదలైన వాటికి ఉపయోగపడుతుంది. ఈ యాప్ 2కె రిజల్యూషన్ నుంచి 60 ఎఫ్‌పిఎస్ వరకు హెచ్‌డీఆర్, ఎస్‌డీఆర్ ఫార్మట్‌లో ఎడిటింగ్ వీడియోలను సపోర్ట్ చేస్తుంది.

ఇక మూడు నిమిషాలు!



యూట్యూబ్ షార్ట్స్ మాదిరిగానే మూడు నిమిషాల నిడివి గల వీడియోలను ప్లాట్‌ఫామ్‌లో అప్లోడ్ చేయవచ్చని తెలియజేసింది ఇన్‌స్టాగ్రామ్. గతంలో 90 సెకన్ల వరకు వీడియోలను అప్లోడ్ చేసే అవకాశం కల్పించింది ఇన్‌స్టాగ్రామ్.

'ఇక నుంచి మీరు మూడు నిమిషాల నిడివి గల రీల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో లాంగ్-ఫామ్ వీడియోలపై కాకుండా షార్ట్-ఫామ్ వీడియోలపై దృష్టి పెట్టాలనుకున్నాం. కానీ 90 సెకనులు చాలా తక్కువ సమయం అని క్రియేటర్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పెంచిన సమయం వల్ల మీరు మరిన్ని స్టోరీలను షేర్ చేయవచ్చు' అని ఇన్‌స్టాగ్రామ్ ప్రకటించింది.



ఏసర్ స్విఫ్ట్ జో 14

స్క్రీన్ సైజ్: 14 అంగుళాలు
స్క్రీన్ రిజల్యూషన్: 2880×1800 పిక్సెల్స్
డైమెన్షన్స్: 312.9×217.9×14.9 ఎంఎం
బరువు: 1.25 కేజీ

ఓపెన్ ఏఐ టాస్క్స్



'టాస్క్స్' అనే న్యూ చాట్‌జీపీటి కేపబిలిటీతో ముందుకురానుంది ఓపెన్ ఏఐ. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. అలారం సెట్ చేయడం, ప్రజెంటేషన్ ఇవ్వడానికి అవసరమైన రాబోయే సమావేశాన్ని గుర్తు చేయడంలాంటి పనులను చేయగలదు. నీరు తాగడం నుంచి గ్రాసరీ షాపింగ్ వరకు ఎన్నో విషయాలలో 'టాస్క్స్' ద్వారా రిమైండర్స్ సెట్ చేసుకోవచ్చు.

సాక్షి సినిమా

హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్

– వెంకటేశ్



● భీమ్స్, వెంకటేశ్, అనిల్ రావిపూడి

''సంక్రాంతి పండగకి నిజాయతీగా ఓ ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనుకున్నాం. ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని ఆదరించారు. హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్ అంటున్నారు. మా సినిమాకి ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైంది. గురువారం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''అనిల్‌తో నేనో ఫ్రెండ్‌లానే ఉంటాను. మేము చాలా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేస్తాం.. అందుకే రిజల్ట్ ఇంత పాజిటివ్‌గా ఉంటుంది. ఇక నా సినిమా ఇన్ని కోట్లు వసూలు చేయాలని నేనెప్పుడూ అడగను... వచ్చింది తీసుకోవాలి. ఇప్పటికే మా సినిమా రూ. 230 కోట్లు వసూలు చేయడం అనేది బోనస్.. ఇంతకంటే ఏం కావాలి'' అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ–''సినిమాకి కాస్త దూరమైన ప్రేక్షకులు కూడా మా 'సంక్రాంతికి వస్తున్నాం' కోసం థియేటర్‌కి రావడం ఆనందంగా ఉంది. రెవెన్యూ సైడ్ కూడా మేం ఊహించినదానికంటే అద్భుతంగా రావడం హ్యాపీ'' అని చెప్పారు. ''వెంకటేశ్‌గారి 'కలిసుందాం రా' సినిమా పాటలని ప్రేక్షకులు ఎంత గుండెల్లో పెట్టుకున్నారో... 'సంక్రాంతికి వస్తున్నాం' సాంగ్స్‌ని కూడా అదే స్థాయిలో ఆస్వాదించడం సంతోషంగా ఉంది'' అని సంగీత దర్శకుడు భీమ్స్ అన్నారు.

లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది

– విశ్వక్ సేన్



● సాహు గారపాటి, విశ్వక్ సేన్, రామ్ నారాయణ్

''నా కెరీర్‌లో యాక్షన్ టచ్‌తో రూపొందిన ఔట్ అండ్ ఔట్ కామెడీ ఫ్యామిలీ ఫిల్మ్ 'లైలా'. చాలా క్లీన్‌గా ఉంటుంది. ప్రేక్షకులంతా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా కోసం లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది. నిజంగా అమ్మాయిలకు హ్యాట్సాఫ్ చెప్పాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ జంటగా నటించిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఇచ్చుకుందాం బేబీ...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. పూర్ణాచారి సాహిత్యం అందించిన ఈ పాటని ఆదిత్య ఆర్కే, ఎంఎం మానసి ఆలపించారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''లైలా'లో మోడల్ సోనూ, లైలా అనే రెండు పాత్రల్లో నటించా'' అన్నారు. ''లైలా' కథ ఇద్దరు ముగ్గురు హీరోలకు చెప్పాను. లేడీ గెటప్ వేయడం అంత ఈజీ కాదు. సినిమా అంటే పిచ్చి ఉంటేనే చేయగలరు. అలాంటి పిచ్చి ఉన్న విశ్వక్ దొరికారు'' అని రామ్ నారాయణ్ చెప్పారు. ''ఈ పాత్ర విశ్వక్ కెరీర్‌లో నిలిచిపోతుంది'' అన్నారు సాహు గారపాటి. పాటల రచయిత పూర్ణాచారి మాట్లాడారు.



● సాయిపల్లవి, నాగచైతన్య

హైలెస్సో హైలెస్సా

'హైలెస్సో హైలెస్సా...' అంటూ ఆడి పాడేస్తున్నారు నాగచైతన్య, సాయిపల్లవి. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జోడీగా నటించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'హైలెస్సో హైలెస్సా... నీవైపే తెరచాపని తిప్పేసా...' అంటూ సాగే మూడో పాటని గురువారం రిలీజ్ చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటని శ్రేయా ఘోషల్, నకాష్ అజీజ్ పాడారు. ''మోస్ట్ ఎవైటెడ్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'తండేల్'. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'బుజ్జి తల్లి..', 'నమో నమః శివాయ...' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. వండర్‌ఫుల్ మెలోడీస్‌ని కంపోజ్ చేయడంలో మాస్టర్ అయిన దేవిశ్రీ ప్రసాద్ తాజాగా 'హైలెస్సో హైలెస్సా..' అంటూ సాగే మరొక లవ్ మెలోడీని కంపోజ్ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● కార్లా సోఫియా గాస్కాన్

97వ ఆస్కార్ అవార్డ్ నామినేషన్స్ ప్రకటన

ఆస్కార్ సంబరం ఆరంభం



● 13 నామినేషన్లతో నాన్ ఇంగ్లిష్ మూవీ 'ఎమిలియా పెరెజ్' రికార్డ్
● 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు 10 నామినేషన్స్
● ట్రాన్స్‌జెండర్‌కి దక్కిన తొలి నామినేషన్ ● ఇండియన్ షార్ట్ ఫిల్మ్‌కి నామినేషన్




97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఈ ఏడాది మార్చి 2న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరగనుంది. కాగా ఈ అవార్డులకు సంబంధించిన నామినేషన్లను గురువారం రాత్రి (భారతీయ కాలమానం ప్రకారం) ప్రకటించారు. అమెరికన్ నటుడు బోవెన్ యాంగ్, నటి రాచెల్ సెన్నాట్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అయితే ఈ నామినేషన్ల ప్రకటన ఈ నెల 17న జరగాల్సింది. కానీ అమెరికాలో చెలరేగిన కార్చిచ్చు కారణంగా 19కి వాయిదా వేశారు. ఫైనల్‌గా 23న ప్రకటించారు.

రికార్డ్ సాధించిన స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్

ఈసారి స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్ మూవీ 'ఎమిలియా పెరెజ్' నాన్-ఇంగ్లిష్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని రికార్డ్ సాధించింది. గతంలో చైనా మూవీ 'క్రౌచింగ్ టైగర్ హిడెన్ డ్రాగన్', మెక్సికన్-అమెరికన్ డ్రామా 'రోమా'... ఈ రెండు చిత్రాలు నాన్-ఇంగ్లిష్ విభాగంలో పది నామినేషన్లు దక్కించుకున్నాయి. ఇప్పుడు 13 నామినేషన్లతో 'ఎమిలియా పెరెజ్' వాటిని అధిగమించింది. అలాగే ఈ చిత్రంలో ఓ లీడ్ రోల్‌లో నటించిన స్పానిష్ నటి కార్లా సోఫియా గాస్కాన్ (బెస్ట్ యాక్ట్రెస్ లీడ్ రోల్ నామినేషన్) చరిత్ర సృష్టించారు. ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయిన తొలి ట్రాన్స్‌జెండర్ నటిగా నిలిచారామె. ఇంకా 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు పది నామినేషన్ల చొప్పున దక్కాయి. అంతగా అంచనాలు లేని 'కాన్‌క్లేవ్' మూవీకి 8 నామినేషన్లు దక్కడం ఓ విశేషం.

ఒక్క నామినేషన్ తేడాతో... నాన్ ఇంగ్లిష్ ఫిల్మ్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని, రికార్డు సాధించిన 'ఎమిలియా పెరెజా'కి ఇంకో నామినేషన్ దక్కి ఉంటే... ఇంగ్లిష్ ఫిల్మ్‌ల రికార్డుని కూడా అధిగమించి ఉండేది. 'టైటానిక్, ఆల్ అబౌట్ ఈవ్, లా లా ల్యాండ్' వంటి ఇంగ్లిష్ చిత్రాలు 14 నామినేషన్లు దక్కించుకున్నాయి.



తల్లి హిస్టరీ రిపీట్: 'ఐయామ్ స్టిల్ హియర్' చిత్రానికి గాను ఫెర్నాండా టోర్రెస్ ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్నారు. ఇందులో విశేషం ఏంటంటే... ఆమె తల్లి ఫెర్నాండా మోంటెనెగ్రో 1991లో 'సెంట్రల్ స్టేషన్' చిత్రానికి గాను ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్న తొలి బ్రెజిలియన్ నటిగా రికార్డుని సాధించారు. ఇప్పుడు ఇన్నేళ్లకు మలి బ్రెజిలియన్ నటిగా టోర్రెస్ నామినేషన్ దక్కించుకుని తల్లి హిస్టరీని రిపీట్ చేశారు.

బరిలో ఇండియన్ షార్ట్ ఫిల్మ్: ఆడమ్ జే గ్రేవ్స్ దర్శకత్వం వహించిన 'అనూజ' బెస్ట్ షార్ట్ ఫిల్మ్ (లైవ్ యాక్షన్) విభాగంలో నామినేషన్ దక్కించుకుంది. ఆల్రెడీ రెండు ఆస్కార్ అవార్డులు సాధించిన భారతీయ నిర్మాత గునీత్ మోంగా ఈ చిత్రానికి ఓ నిర్మాత కావడం విశేషం. అలాగే నటి ప్రియాంకా చోప్రా ఓ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఢిల్లీలోని ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో పని చేసే తొమ్మిదేళ్ల అనూజ స్కూల్‌కు వెళ్లాలనుకుంటుంది. ఆ నిర్ణయం ఆమె జీవితాన్ని, అనూజ సోదరి పాలక్ భవిష్యత్‌ను ఏ విధంగా ప్రభావితం చేసింది? అనే కోణంలో ఈ చిత్రం సాగుతుంది. అనూజగా సజ్దా పఠాన్, పాలక్‌గా అనన్య షాన్‌భాగ్ నటించారు. ఇదిలా ఉంటే... గునీత్ మోంగా ఓ నిర్మాతగా వ్యవహరించిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కి గాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో 2023లో ఆస్కార్ దక్కింది. అంతకుముందు 2021లో గునీత్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన 'పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్'కిగాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డు దక్కింది. ఇప్పుడు ఆమె ఓ నిర్మాతగా వ్యవహరించిన 'అనూజ'కు కూడా ఆస్కార్ దక్కుతుందా? అనేది చూడాలి.

ఉత్తమ చిత్రం: అనోరా, ది బ్రూటలిస్ట్, ఎ కంప్లీట్ అన్‌నోన్, కాన్‌క్లేవ్, డ్యూన్: పార్ట్ 2, ఎమిలియా పెరెజ్, ఐయామ్ స్టిల్ హియర్, నికెల్ బాయ్స్, ది సబ్‌స్టాన్స్, విక్డ్ ● **ఉత్తమ దర్శకుడు:** సీన్ బేకర్ (అనోరా), బ్రాడీ కార్బెట్ (ది బ్రూటలిస్ట్), జేమ్స్ మ్యాన్‌గోల్డ్ (ది కంప్లీట్ అన్‌నోన్), జాక్వెస్ ఆడియార్డ్ (ఎమిలియా పెరెజ్), కోరలీ ఫార్గేట్ (ది సబ్‌స్టాన్స్) ● **ఉత్తమ నటుడు:** అడ్రియాన్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్), తిమోతీ చాలమెట్ (ది కంప్లీట్ అన్‌నోన్), కోల్‌మెన్ డొమినింగో (సింగ్‌సింగ్), రేఫియన్నెస్ (కాన్‌క్లేవ్), సెబస్టియన్ స్టాన్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ నటి:** సింథియా ఎరివో (విక్డ్), కార్లా సోఫియా గాస్కన్ (ఎమిలియా పెరెజ్), మికే మాడిసన్ (అనోరా), డెమి మూర్ (ది సబ్‌స్టాన్స్), ఫెర్నాండా టోర్రెస్ (ఐ యామ్ స్టిల్ హియర్) ● **ఉత్తమ సహాయ నటుడు:** యురా బోరిసోవ్ (అనోరా), కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), ఎడ్వర్డ్ నార్టన్ (ది కంప్లీట్ అన్‌నోన్), గాయ్ పియర్స్ (ది బ్రూటలిస్ట్), జెరీమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ సహాయ నటి:** మోనికా బార్బరో (ది కంప్లీట్ అన్‌నోన్), అరియానా గ్రాండే (విక్డ్), ఫెలిసిటీ జోన్స్ (ది బ్రూటలిస్ట్), ఇసబెల్లా రోస్సెల్లిని (కాన్‌క్లేవ్), జోయా సాల్డానా (ఎమిలియా పెరెజ్).

భారతీయ సినిమాకి నిరాశ

ఆస్కార్ అవార్డ్స్ రిమైండర్ లిస్ట్‌లో నిలిచిన భారతీయ చిత్రాలు 'కంగువ, ఆడు జీవితం ('ది గోట్ లైఫ్'), సంతోష్, స్వతంత్రవీర్ సవార్కర్, ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్, గర్ల్స్ విల్ బీ గర్ల్స్, పుతల్' ఆస్కార్ నామినేషన్‌ను దక్కించుకోలేకపోయాయి. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం ఈ ఏడాది ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పంపిన హిందీ చిత్రం 'లాపతా లేడీస్' ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లోనూ చోటు దక్కించుకోలేకపోయిన విషయం తెలిసిందే. ఇలా ఈసారి భారతీయ సినిమాకి నిరాశ ఎదురైంది.